# చాటింగ్ లవ్




**మా**కాలనీ యూత్ అంతా కూడా ఈ మధ్య మన దేశంలోని యూత్ అందరిలాగానే ఇంటర్నెట్ ఎడిక్ట్స్ అయిపోయారు.

ఎవరూ కాలనీ మీటింగ్‌లకు రావటం లేదు– అసలు కాలనీలో ఎవరికీ కనిపించటం కూడా లేదు.

మా కాలనీలో వినాయక చవితి ఉత్సవాలు సాధారణంగా మా యూత్ అసోసియేషన్ వాళ్ళే నిర్వహిస్తారు గానీ ఈసారి ఒక్కరూ ముందుకు రాకపోయేసరికి మాకు డౌటొచ్చేసింది.

అసలువాళ్ళు పార్టిసిపేట్ చేస్తారా లేదా అనేది తెలుసుకోడానికని ఒక్కొక్కరింటికి వెళ్ళటం మొదలుపెట్టాం.

ముందు రాజేష్ ఇంటికెళ్ళేసరికి గడ్డం పెంచుకుని పిచ్చాడిలా కనిపించాడు.

"ఏమిటి ప్రాబ్లెమ్? ఏమైనా జబ్బా?" అంటూ పలుకరించాం.

"కాదంకుల్– అయామ్ ఓకే–"

"మరీ గడ్డం అదీ–"

"మనసు బావుండలేదంకుల్–"

"ఎందుకని?"

"మా చాటింగ్ ఫ్రెండ్ సునీత చాటింగ్‌కి రావటం లేదు–"

"రా పోతేపోనీ–"

"కష్టం అంకుల్– తనతో చాటింగ్ చేయకుండా నేనుండలేను–"

ఆ మర్నాడు రాజేష్‌ని హాస్పిటల్లో చేర్చారు.

రెండోరోజు గాళ్స్‌వింగ్ కల్చురల్ సెక్రటరీ మిథాలిను కలుసుకున్నాం.

"రేపు మాణింగ్ రండంకుల్– ఇప్పుడు నేను బిజీగా ఉన్నాను–"

"ఏం బిజీ?"

"ఫేస్‌బుక్ లాగ్ అయి ఉన్నాను–"

"తర్వాత మళ్ళీ అవ్వచ్చుగా–" అంటూండగానే వెళ్ళి లాప్‌టాప్ ముందు కూర్చుంది.

"రోజూ ఇదే వరుస– రాత్రి పన్నెండింటివరకూ అంతే" అంది వాళ్లమ్మ.

ఆ తరువాత శ్రీకాంత్ దగ్గర కెళ్ళాం.

ఇద్దరు గాళ్స్‌తో కూల్‌డ్రింక్స్ తాగుతూ మాట్లాడుతున్నాడతను.

"వాళ్ళిద్దరూ నా ఛాటింగ్ ఫ్రెండ్సంకుల్" అంటూ పరిచయం చేశాడు.

"ఇద్దరిలో ఎవర్ని లవ్ చేస్తున్నావ్?"

"ఇంకా డిసైడ్ చేసుకోలేదు"

"ఏంటి డిసైడ్ చేసుకోలేదు?"

"ఇద్దర్నీ లవ్ చేసే విషయం–"

మాకు మతిపోయింది– అందరం మీటింగ్ రూమ్‌కెళ్ళి కూర్చున్నాం– మా కాలనీలోనే ఉండే బాబూరావ్ ఇంట్లో అద్దెకుండే స్టూడెంట్ సురేష్‌కి ఈ మధ్య జరిగిన ఒక ఇన్సిడెంట్ గురించి చెప్పటం మొదలుపెట్టాడు.

* * * * *

సురేష్ పక్క రూమ్‌లో కొత్తగా దిగిన సాఫ్ట్‌వేర్ గాళ్‌కి లైట్ కొడుతూండగా సెల్ మోగింది.

"హలో" అన్నాడు సురేష్.

"హలో" అంది ఓ అందమైన లేడీ గొంతు.

ఆ గొంతు ఎవరిదో ఓ పట్టాన అర్థంకాలేదు. చకచక తన మెమొరీ డిస్క్ ఓపెన్

చేశాడుగానీ అది స్ట్రక్ అయిపోయింది.

"హాయ్ నేనే" అందా గొంతు.

"నువ్విలా ఫోన్ చేయటం చాలా ప్లెజెంట్‌గా ఉంది" అలా కాసేపు మాట్లాడిస్తే ఎవరో గుర్తుపట్టొచ్చుగదాని ప్లాన్.

"యా- చేయక తప్పలేదు"

"యా యా- ఏమిటి విశేషం? ఈవెనింగ్ కలుస్తున్నామా?"

"అదెలాగూ తప్పదుగానీ, మన కొంపమునిగింది!" అందా అమ్మాయ్.

సురేష్ కంగారుపడ్డాడు.

"మన కొంపా?" అనుమానంగా అడిగాడు. తనెప్పుడూ రూమ్‌లు షేర్ చేసుకుంటాడు గానీ కొంపలు షేర్ చేసుకోడు.

"అవును-" అందా అమ్మాయ్.

"వాహ్-! కొంప! అంటే ఏ కొంప?"

"ఇడియట్! నేను ప్రెగ్నెంట్ అయ్యాన్రా!"

"అమ్మో!" అదిరిపడ్డాడు సురేష్.

ఇలాంటి డైలాగ్‌లు వినే పరిస్థితి రాకుండా తను చాలా కేర్‌ఫుల్‌గా ఉంటాడు.

అయినా అప్పుడప్పుడు అదే రీసౌండ్‌లా వినిపించి ప్రాణాలు తోడేస్తుంటాయ్. మొత్తం స్త్రీ జాతిమీదే విరక్తి పుట్టిస్తూంటాయ్.

ఇంక లాభం లేదు. ముందీ క్యాండేట్ ఎవరో తెలుసుకోవాలి.

"హలో! ఎవరు మాట్లాడేది?" అడిగాడు ధైర్యం తెచ్చుకుని.

ఆ క్యాండేట్‌కి వళ్ళు మండినట్లుంది.

"ఏంటి? ఎవరు మాట్లాడేదా? నేనేనని చెప్తున్నా అర్థం కాలేదా?"

"అయింది- అయిందయింది- అదే పేరు కన్‌ఫరమ్ చేసుకుందామని-"

"అంటే ఇంతసేపూ నా పేరు తెలీకుండానే మాట్లాడావా?"

"అహహ.. అంటే..ఆ! వినీత!"

"అంటే? వినీత అనేది ఒకటుందా నీకు? షేమ్‌లెస్ ఫెలో-"

"అహహ! వినీతంటే, జస్ట్ ఫ్రెండ్. మా ఇద్దరి మధ్యా ఏం లేదు"

"ఏమీ లేదా? కనీసం బెడ్‌షీట్ కూడా లేదా? సిగ్గులేని రకం-"

"అయ్యయ్యో అదికాదు-"

"అంటే జస్ట్ ఫ్రెండ్స్‌ని కూడా ప్రెగ్నెంట్ చేస్తావా?"

"నోనోనో- విషయం ఏంటంటే, నీ వాయిస్ కొంచెం మా మిసెస్ వాయిస్‌ని పోలి

ఉంటుంది కదా! అందుకని మా మిసెస్ అనుకున్నా–"

"అంటే నీ మిసెస్ వాయిస్‌ని కూడా గుర్తుపట్టలేవన్నమాట"

"ప్లీజ్– సారీ! సడెన్‌గా నీ వాయిస్ విని మా మిసెస్ అనుకున్నా"

"నేను నీ మిసెస్‌నేరా రాస్కెల్"

సురేష్ ఇంకా కన్‌ఫ్యూజయ్యాడు.

"ఓ! మిసెసా? సారీ డియర్! వాయిస్ కొంచెం స్వీట్‌గా ఉంటేనూ మిసెస్ కాదనుకున్నా"

"నువ్ మారావని ప్రామిస్ చేశావ్ కదా త్రీడేస్ బ్యాక్. ఆ మాట నమ్మటం నా తప్పురా!"

"సారీ డియర్! సారీ అన్నాను కదా– కానీ అది ఎలా జరిగింది?"

"ఏదెలా జరిగింది?"

"అదే! ప్రెగ్నెన్సీ–"

"అంటే? అది కూడా తెలీదా నీకు? అన్ని విషయాలూ తెల్సినట్లు ఫోజులు కొడతావ్ కదరా!"

"అహహ! అది ఒకే! కానీ, నేను చాలా కేర్‌ఫుల్‌గా ఉంటాగదాని!"

"నీ బోడి కేర్ సంగతెవడికి తెలీదు. మందు కొడితే మనిషికి కాదుగా!"

"చిలిపీ! మందు ఒక్కడినే కొట్టే అలవాటు లేదని నీకూ తెలుసుగా!"

"అదేరా నేనూ అనేది! మందుకొట్టే కంపెనీ కోసం రోజుకోదాన్తో వెధవ్వేషాలేస్తున్నావ్!"

"ప్లీజ్! నువ్వెవరో చిన్న క్లూ ఇవ్వవా?"

"నీ మిసెస్‌నని చెప్తూంటే సిగ్గులేకుండా మళ్ళీ ఆ ప్రశ్నేమిట్రా?"

"యా యా– అయ్‌నో– అయ్‌నో– అయిన చిన్న క్లూ ఇవ్వకూడదూ?"

"అంటే నీ ఉద్దేశ్యం ఏంటి? నీకు పదిమంది మిసెస్‌లున్నారా?"

"ఛ! నేనేం నిత్యపెళ్ళికొడుకునా? అది కాదుగానీ, పేరు చెప్పకూడదూ?"

"అంటే? ఇంతసేపూ ఎవర్తో మాట్లాడుతున్నావో తెలీకుండానే మాట్లాడావా?"

"నా మిసెస్‌తోనే అని తెలుసే! మరీ అంత డీగ్రేడ్ చెయ్యక్కర్లా నన్ను! మిసెస్ అంటే ఏ ఏరియా మిసెస్? ఆంధ్రనా? తెలంగాణానా? రాయలసీమనా?"

"అంటే నీకు రీజియన్‌కో మిసెస్ ఉందన్నమాట. అయిపోయావురా ఇవాళ– ఇప్పుడే వచ్చి నీ అంతు తేలుస్తా!"

ఫోన్ కట్టయింది.

"ఓర్నాయనో! ఇవాళ పరిస్థితి కొంచెం ఆంధ్రప్రదేశ్ లాగానే ఉండేట్లుంది"

అనుకుంటూ లేచి నిలబడేసరికి గడపలో నిలబడ్డ యువతి కనిపించింది.

ఆటోమేటిగ్గా చిరునవ్వు నవ్వి "హాయ్" అన్నాడు.

"హాయ్" అందా యువతి.

సురేష్ మెమొరీ బ్రౌజ్ చేశాడు.

ఎవరో తెలీటంలేదు. కానీ ఫేస్ పరిచయం ఉన్నట్లే ఉంది. అదేం విచిత్రమో గానీ ఈ మధ్య గాళ్స్ అందరూ బాగా క్లోజ్ ఫ్రెండ్స్ లాగానే కనబడుతున్నారు.

ఎవరు ప్రియురాలు? ఎవరు ప్రియుడు? అసలెవరితో ఎంతవరకూ పరిచయం కొత్తాళ్ళెవరు- అంతా ఒకటే కన్ఫ్యూజన్.

మళ్లీ వెధవ నవ్వు నవ్వాడు సైలెంట్‌గా ఉండలేక.

"సో- హియర్ వుయార్" అన్నాడు ఇంగ్లీష్‌లో.

"యా" అందామె హ్యాపీగా.

"నువ్ రావటం ప్లెజెంట్ సర్‌ప్రైజ్" అన్నాడు.

చెంప పేలిపోయింది- అదిరిపడ్డాడు.

"ఏంటలా కొట్టావ్?"

"ప్లెజెంట్ పర్‌ప్రైజేంటి? ఈ టైమ్‌కి రమ్మని బతిమాలింది నువ్వేగా?"

"అహ్హాహ్హా! అవునవును! బతిమాలాను- ఫోన్లో కదా?"

మళ్లీ చెంప ఛెళ్లుమంది.

"మళ్ళీ ఏంటి?"

"ఫోన్లో అంటావేంటి?"

"ఓహెూ! యాయా! ఫోన్లో కాదు- కాదు కానేకాదు- మనం రెస్టారెంట్‌లో కలుసుకున్నప్పుడు-"

మళ్ళీ చెంప చెళ్లుమంది.

"అంటే ఇలా ప్రతి డైలాగ్‌కీ వాయిస్తావా?"

"లేకపోతే ఏంటి? గంటల తరబడి నిన్ను ప్రేమించాను. నీలాంటి అందగత్తెను జన్మలో చూళ్లేదు. ఒక్కసారి నిన్ను తనివితీరా చూస్తే జన్మ ధన్యమయిపోతుంది" అని లెక్చర్స్ ఇచ్చావ్‌గా! అంతా బోగసేనా? అసలు నేనెవరో తెలీనట్లు ఫేస్‌లో ఆ ఎక్స్‌ప్రెషనేంట్రా?"

"ఆ! రానా అంటే యా- యా గుర్తుకొచ్చింది అనితా! అనిత! యా! అనితా! ఎంత కాలమయింది మనం కలుసుకుని హ్యాపీగా" అంటూండగానే చెంప మళ్ళీ పేలింది.

"నా పేరు అనితా? నిజం చెప్పు హూ ఈజ్ దట్ బిచ్?"

"అరెరె– అలా రైజవబోకు! కూల్ కూల్– నువ్ అచ్చం అనితలాగే ఉన్నావ్ అందుకని–"

చెంప ఛెళ్లుమంది.

"అమ్మో! మళ్ళీ ఏమయింది? మాట్లాడితే చెంప పగలగొడుతున్నావ్. ఇదేం చెంపనుకున్నావా? బాస్కెట్ బాల్ గ్రౌండ్ అనుకున్నావా?"

"లేకపోతే, అనితలాగ ఉన్నానంటావేంటి? నేను అనితనేరా రాస్కెల్"

"ఆ! అనితవేనా? యా! యా! కుకట్‌పల్లి అనితవె"

చెంప మళ్లీ పగిలింది.

"కుకట్‌పల్లి అనితను కాదురా, చిక్కడపల్లి అనితని"

"అబ్బ! ఇప్పటికి గుర్తుకొచ్చింది" అన్నాడు గానీ ఇంకా కన్‌ఫ్యూజన్ ఎక్కువయిపోయింది.

ఈ కాండేట్‌ని చూసినట్లే ఉందిగానీ ఎక్కడ కలిశాడో, ఎప్పుడు పిలిచాడో ఏమీ అర్థం కావటం లేదు.

"ఇంకా ఆ కన్‌ఫ్యూజన్ లుక్కేమిట్రా? రూమ్‌కి రమ్మని అలా ఒంగోల్ బర్రె మొఖం వేసుకు చూస్తున్నావేంటి? ఈ మాత్రానికే ఎందుకు రమ్మన్నావ్ రా"

"అదా! జస్ట్ ఎంజాయ్ కోసం– రా! ఆ బెడ్ మీద కూర్చో! మనం చాలా మేటర్ మాట్లాడుకోవాలి"

"ఇంకా ఏం మేటరుంటుంది? నెలరోజులున్నుంచి గంటలు గంటలు చాటింగ్ చేసుకుంటూనే ఉన్నాంగా!"

"ఆ! చాటింగా? అంటే మనం చాటింగ్ ఫ్రెండ్సా?"

చెంప మళ్ళీ పేలిపోయింది.

"అమ్మో"

"అంటే చాటింగ్‌లో ఇంకా చాలామందిని నాకు చెప్పినట్లే అయ్ లవ్ యూ చెప్తున్నావా?"

"నెవర్ యార్– నేనెందుకు చెప్తాను? నిజంగా నిన్ను లవ్ చేశాను కాబట్టి నీకే చెప్పాను"

"చూడు రాకేష్! కేవలం ఈనెల రోజుల చాటింగ్‌లో నీ లవ్‌లోపడి నేనెంత పిచ్చిదాన్నయిపోయానో తెలీదు. అందుకే ఇవాళ మనం ఏమయినా సరే కలుసుకుని ఎంజాయ్ చేయాలని నువ్వు బతిమాలితే హ్యాపీగా వప్పుకొన్నా– నేను వచ్చేసరికి ఇల్లంతా నా కోసం ఫ్లవర్స్‌తో డెకరేట్ చేస్ ఉంచుతానన్నావ్. గోడలమీద వెల్‌కమ్ టు మై లవ్

చిక్కడపల్లి అనితా" అని ఎన్‌గ్రేవ్ చేస్తానన్నావ్. తీరా నేనొచ్చేసరికి ఏముంది? చెత్త రూమూ. ఖాళీ బీరుబాటిల్సూ-"

"సారీ డియర్! రాత్రి లేటుగా రూమ్‌కొచ్చాను. పొద్దున్నే నీకోసం డెకొరేట్ చేద్దామనుకున్నాగానీ, ఈ లోపలే నువ్ వచ్చేశావ్" అన్నాడు ఫీలయిపోతూ.

"ఈసారికీ సారీ అనితా! అయ్ మీన్ చిక్కడపల్లి అనితా!"

అనిత హ్యాపీగా అతని కౌగలించుకుని ముద్దు పెట్టుకుంది.

"ఇది ఫస్ట్‌టైమ్- నేను లవ్ చేసినతనిని- అంతనింటికొచ్చి కలుసుకోవడం- అందుకే కొంచెం నెర్వస్‌గా ఫీలయి నిన్ను అయ్ మీన్- నీ చెంపని బాస్కెట్ బాల్ ఆడాను. అయామ్ సారీ రాకేష్"

సురేష్ ఉలిక్కిపడ్డాడు.

"రాకేషా! రాకేషేంటి? ఇందాక్కూడా రాకేష్ అన్నావ్"

"అంటే నీ పేరు రాకేష్ కాదా?"

"కాదు, సురేష్!"

అతని చెంప చెళ్ళుమంది.

"అమ్మో! మళ్ళీ ఎందుక్కొట్టావ్?'

"నీ పేరు సురేష్ అయితే చాటింగ్‌లో నాకు రాకేష్ అని చెప్పినందుకు! ఇలా దొంగ పేర్లతో చాటింగ్ చేసే వాళ్లంటే నాకు మంట"

సరిగ్గా అప్పుడే ఆ అమ్మాయి సెల్ మోగింది.

"హలో!"

"హాయ్ అనితా! ఇంకా రాలేదేంటి? నీ కోసం వెయిట్ చేస్తున్నా డియర్?"

అనిత కన్‌ఫ్యూజయింది.

"నా కోసం వెయిట్ చేస్తున్నావా?"

"అవును డియర్! రూమంతా పూలతో డెకొరేట్ చేసి మధ్యలో వెల్‌కమ్ టు మై డార్లింగ్" అని కూడా ఎన్‌గ్రేవ్ చేశా"

"అదేంటి నేను- ఇదే అపార్ట్‌మెంట్స్‌లో ఉన్నా కదా?"

"వచ్చేశావా? లవ్‌లీ! ఎక్కడున్నావిప్పుడు? లిఫ్ట్‌లో ఫోర్త్ ఫ్లోర్‌కి రావాలి"

అనిత సురేష్ వేపు చూసింది.

"ఇది ఫోర్త్ ఫ్లోర్ కాదా?" అడిగింది.

"నో నో, థర్డ్ ఫ్లోర్- ఏ ఫ్లోర్లయితే ఏంటి? మనం కలుసుకోవటం ముఖ్యం కదా" అని ఆమెను ముద్దు పెట్టుకున్నాడు.

అతన్ని అతి కష్టమ్మీద తోసేసింది అనిత.

"అదికాదు. నేను కొంచెం కన్‌ఫ్యూజయ్యాను."

"ఏం కన్‌ఫ్యూజయ్యావ్?"

"అదే! ఫోర్త్ ఫ్లోర్ అనుకుని థర్డ్ ఫ్లోర్‌లో మీ ఇంటికొచ్చా"

"అయిందేదో అయిపోయింది కదా డియర్" అంటూ మళ్లీ కౌగిలించుకున్నాడు సురేష్.

అతని చెంప చెళ్ళుమంది.

"రాస్కెల్! నా లవర్ రాకేష్‌నని అబద్ధం చెప్పి నాతో ఎంజాయ్ చేయాలని చూస్తావా?" అనేసి వేగంగా ఫోర్త్ ఫ్లోర్‌కి పరుగెత్తింది.

అప్పుడే సురేష్ సెల్ మోగింది మళ్ళీ.

"హలో! కూకట్‌పల్లి అనితా! హౌ ఆర్ యూ? ఏంటి శివరామ్‌పల్లి అనితవా? హాయ్! వెల్‌కమ్! వెల్‌కమ్!"

* * *

బాబూరావ్ ఆ కథ చెప్పటం ముగించేసరికి మాకర్థమయింది.

ఇంక యూత్ మీద ఆధారపడి లాభంలేదు.

మేమే వినాయక చవితి కాలనీలో జరిపే ఏర్పాట్లు చేసుకోవాలి.

* * * * *